అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
శుక్రవారం 11 ఆగస్టు 2023

హత్యకు దారి తీసిన అక్రమ సంబంధం

తాండూర్ : మండలం అచలాపూర్ గ్రామానికి చెందిన సిద్దం శ్రీనివాస్(40) హత్యకు గురైన కేసును పోలీసులు 24 గంటల్లోనే చేదించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దం శ్రీనివాస్ తన భార్య బానక్క, ఇద్దరు పలిల్లలతో తాండూర్ ఐబీలో అద్దెకుంటూ రైల్వే కూలీగా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా మేడి శంకర్ అనే వ్యక్తి పరిచయం కావడంతో శ్రీనివాస్ భార్య బానక్కతో అక్రమ సంబంధం ఏర్పడింది. విషయం తెలిసిన శ్రీనివాస్ రోజు తాగొచ్చి భార్యతో గొడువ పడేవాడు. బుధవారం రాత్రి శ్రీనివాస్ అతిగా మద్యం తాగి గోపాల్‌నగర్ క్రాస్‌రోడ్డు వద్ద పడి ఉన్నాడని భానక్క ప్రియుడు శంకర్‌కు ఫోన్ చేసి తన భర్తను చంపేయమని చెప్పింది. వెంటనే శంకర్ అక్కడికి చేరుకుని రోడ్డు పక్కనే స్పృహ కోల్పోయి ఉన్న శ్రీనివాస్‌ను బుదలో పడేసి కాలుతో తలను బురదలో తొక్కి మృతి చెందాడని నిర్ధారించుకుని బానక్కకు ఫోన్ చేసి నీ భర్తను చంపేశానని చెప్పాడు. బెల్లంపల్లి ఏసీపీ, పి సదయ్య ఆధ్వర్యంలో సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కే. శ్రీనివాస్ తన పోలీసు బృందంతో కేసును చేదించి నిందితులను అరెస్టు చేశారు.

వ్యవసాయ సాగులో యువత ఆదర్శం కావాలి

నవతెలంగాణ-భీమారం



వ్యవసాయ రంగానికి యువత ఆధర్శంగా నిలవాలని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే, డాక్టర్ బాల్క సుమన్ అన్నారు. బూరుగుపల్లి గ్రామానికి చెందిన భుక్య రాజు నాయక్ జాన్వికారుద్ర ఆగ్రో వారి సౌజన్యంలో ఆర్గానిక్ పద్ధతిలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేశాడు. ఈ నేపథ్యంలో తోలి కాతలో వచ్చిన డ్రాగన్ ఫ్రూట్లను గురువారం విప్ సుమన్‌ను రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు చెరుకు సర్వోత్తం రెడ్డితో కలిసి వెళ్ళి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, గ్రామానికి చెందిన యువకులు పాల్గొన్నారు.

తొలి విడత సమాప్తం..!

- ముగిసిన గృహలక్ష్మీ దరఖాస్తుల ప్రక్రియ
- తహసీల్దార్ కార్యాలయాలకు పోటెత్తిన అర్జీదారులు
- నేటి నుంచి క్షేత్రస్థాయి పరిశీలనలో యంత్రాంగం
- తక్కువ గడువుతో అనేక మంది దరఖాస్తులకు దూరం

పేదల సొంతింటి కల కోసం ప్రభుత్వం అందిస్తున్న గృహలక్ష్మీ పథకానికి తొలి విడత దరఖాస్తుల ప్రక్రియ ముగిసింది. గురువారం చివరి రోజు కావడంతో తహసీల్దార్ కార్యాలయాలకు అర్జీదారులు భారీగా పోటెత్తారు. గడువు దగ్గర పడుతున్న కొద్దీ అనేక మంది జనాలు తండోపతండాలుగా తరలివచ్చారు. భారీ స్థాయిలో వచ్చిన అర్జీదారులతో తహసీల్దార్ కార్యాలయాలు కిక్కిరిసిపోయాయి. కానీ వివిధ ధ్రువపత్రాలు లేకపోవడం.. సమయం ముగిసిపోవడంతో చాలా మంది అర్హులైన నిరుపేదలు సొంతింటి నిర్మాణం కోసం దరఖాస్తులు చేయలేకపోయారు. బుధవారం వరకు ఆదిలాబాద్ జిల్లాలో 22వేల దరఖాస్తులు రాగా.. చివరి రోజు - దరఖాస్తులు రావడం గమనార్హం. ఇక చాలా మంది దరఖాస్తుల సమయంలో కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలు అందించలేదు. వాటి కోసం తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులు చేశారు. అధికారులు పరిశీలన పూర్తిచేసే లోగా లబ్ధిదారులు వీటిని అందించాల్సి ఉంటుంది. వీటిని జారీ చేయడంలో తహసీల్దార్ కార్యాలయాల్లో ఆలస్యం కావడంతో అర్హులైన నిరుపేదలు సొంతింటికి దూరమయ్యే ప్రమాదం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, దహెగాం

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి తొమ్మిదేండ్ల తర్వాత ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి దరఖాస్తులు తీసుకోవడంతో భారీగా దరఖాస్తులు వచ్చాయి. గతంలో డబుల్ బెడ్‌రూంలు ఇస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ ఆచరణలో కార్యరూపం దాల్చలేదు. ఆదిలాబాద్ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో నిర్మించినా వాటిని పంపిణీ చేయలేదు. రెండోసారి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం గృహలక్ష్మీ పథకం కింద సొంత జాగా కలిగిన వారికి రూ.3లక్షల ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించింది. కానీ కొన్నేండ్ల నుంచి ఇప్పుడు..అప్పుడు అంటూ ఊరిస్తూ రావడంతో ఇండ్లులేని నిరుపేదలు నిరుత్సాహానికి గురయ్యారు. ఇండ్లులేని పేదల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత రావడంతో ఎట్టకేలకు దిగొచ్చిన సర్కారు గృహలక్ష్మీ పథకం కింద దరఖాస్తులు చేసుకోవాలని సూచించింది. ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు గడువు విధించింది. కేవలం మూడు రోజులు మాత్రమే గడువు ఉండటంతో లబ్ధిదారులు ఆందోళనకు గురయ్యారు. ముఖ్యంగా దరఖాస్తుకు కావాల్సిన రేషన్‌కార్డు, ఓటరు ఐడీ కార్డు, ఆధార్‌కార్డు, ఇంటి పన్ను రసీదు, కరెంటు బిల్, బ్యాంకు ఖాతా, కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలు, నోటరీ అఫిడవిట్ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. వీటిలో ప్రస్తుతం కొన్ని పత్రాలు లేకపోయినా దరఖాస్తులు స్వీకరించినప్పటికీ.. లబ్ధిదారులు మాత్రం వాటన్నింటిని సమీకరించేందుకు తంటాలు పడుతున్నారు.

చివరి రోజు పోటెత్తిన అర్జీదారులు

గృహలక్ష్మీ పథకం దరఖాస్తులకు గురువారం చివరి రోజు కావడంతో లబ్ధిదారులతో తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాలు కిటకిటలాడాయి. దరఖాస్తుకు గడువు తక్కువగా ఉండటంతో వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రానికి అర్జీదారులు భారీగా తరలివచ్చారు. ఆయా కార్యాలయాల్లో అధికారులు ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటుచేశారు. దీంతో వందలాది మంది లబ్ధిదారులు వరుసలో నిలబడి దరఖాస్తులు అందజేశారు. తొలి విడతలో నియోజకవర్గానికి 3వేల మంది లబ్ధిదారులకు మంజూరు చేయడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 30వేల మందికి సొంతింటి కల నెరవేరనుంది. మరోపక్క చివరి రోజు సాయంత్రం వరకు దరఖాస్తులు స్వీకరించడం.. మండలాల వారీగా వచ్చిన వాటిని క్రోడీకరించి జిల్లా స్థాయి అధికారులకు జాబితా పంపించనున్నారు. జిల్లాలో రెండో రోజున 22వేల దరఖాస్తులు రాగా చివరి రోజు వీటి సంఖ్య రెట్టింపయినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. పూర్తిస్థాయిలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయో రాత్రి వరకు సమాచారం తెలిసే అవకాశం ఉందని తెలిపారు. మరోపక్క వచ్చిన దరఖాస్తులను పక్షం రోజుల్లోగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టనున్నారు. ఇందులో అర్హులను గుర్తించి లబ్ధిదారులుగా ఎంపిక చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

దళిత రైతును కొట్టిన వ్యక్తిపై అట్రాసిటి కేసు

నవతెలంగాణ-కోటపల్లి



మండలంలోని శెట్‌పల్లి గ్రామంలో దళిత రైతును కులంపేరుతో దూషిస్తూ రెడ్డి కులానికి చెందిన వ్యక్తి కుల అహంకారంతో కట్టేసి కొట్టిన ఘటన మండలంలో గురువారం కలకలం రేపింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కోటపల్లి పోలీస్‌స్టేషన్‌లో అట్రసిటీ కేసు నమోదు చేసినట్టు ఎస్సై సురేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శెట్టిపల్లి గ్రామానికి చెందిన దళిత రైతు దుర్గం బాపు ఎద్దులు అదే గ్రామానికి చెందిన సూరం రామిరెడ్డి పొలంలో బాపుకు చెందిన ఎడ్లు వెల్లాయని కోపొద్రేకానికి లోనయ్యాడు. ఇంట్లో ఉన్న దుర్గం పాపుని పరుషపదజాలంలో దూషిస్తూ ఈడ్చుకెళ్లి రామిరెడ్డి ఇంటో కట్టేసి కొట్టాడు. ఎస్సీ నేతకాని వర్గానికి చెందిన దుర్గం బాపును కులాహంకారంతో కులం పేరుతో దూషిస్తూ అతని ఇంట్లో నుండి కొట్టుకుంటూ తీసుకెళ్లి చెట్టుకు కట్టేసి అందరి ముందు ఇష్టం వచ్చినట్టు కొట్టాడు. కులం పేరుతో దూషిస్తూ ఇష్టం వచ్చినట్లు కొట్టడంతో బాదితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. విషయం తెలుసుకున్న కేవీపీఎస్ నాయకులు సదరు వ్యక్తిని కటినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చెపడతామని హెచ్చరించారు.

'నా మట్టి నా దేశం' కార్యక్రమాలను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

భారతీయ జనతా పార్టీ కేంద్ర శాఖ ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నెల 11 నుండి 'నా మట్టి నా దేశం' కార్యక్రమాలను సిర్పూరు (టి) నియోజకవర్గంలో చేపట్టనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు కోరారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు పూర్తయ్యి ఆజాదీకా అమృత్ మహోత్సవ్ నిర్వహిస్తున్న సందర్భంగా ఈ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నెల 11, 12 తేదీలలో ప్రతీ గ్రామ కూడళ్లలో మట్టి దీపాల ప్రదర్శన, ప్రతిజ్ఞ, 13న ప్రతీ గ్రామంలో 75 మొక్కలు నాటడం, దేశ విభజనను నిరసిస్తూ మౌన ప్రదర్శనలు, 13, 14, 15 తేదీలలో ప్రతీ ఇంటిపై, కార్యాలయాలలో, గ్రామ కూడళ్లలో జాతీయ జెండాలను ఆవిష్కరించడం, 16 నుండి 26 వరకు ప్రతీ గ్రామం నుండి మట్టి సేకరణ చేసి ఢిల్లీకి పంపించడం కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులు గోలెం వెంకటేష్, అసెంబ్లీ కన్వీనర్ వీరభద్రచారి, పట్టణ అధ్యక్షులు సిందం శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ ఎల్కుటె మల్లయ్య, మాజీ కౌన్సిలర్ ఈర్ల విశ్వేశ్వర్‌రావు, నాయకులు రణవీర్ బిస్వాస్, మాచర్ల శ్రీనివాస్, రాజేందర్ జంజోడ్, చేరాల శ్రీనివాస్, ముత్తు అశోక్ పాల్గొన్నారు.

ఛలో హైద్రాబాద్‌ను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పాత పెన్షన్ సాధన కోసం ఈ నెల 12న చేపట్టే ఛలో హైద్రాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎస్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముడిమడుగుల తిరుపతి కోరారు. గురువారం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రధాన సమస్య సీపీఎస్ అని అన్నారు. దీనిని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని సాధించుకునేంత వరకు పోరాటం చేస్తామని అన్నారు. 12న హైద్రాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించే బహిరంగ సభకు ప్రతీ ఉద్యోగి హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌సీపీఎస్‌ఈయు రాష్ట్ర కార్యదర్శి పెద్దింటి క్రాంతి, రాష్ట్ర ఐటీ సెల్ బాధ్యులు పుల్లూరి బాలు,బ కాగజ్‌నగర్ డివిజన్ అధ్యక్షులు డొంగ్రి జనార్ధన్, జిల్లా కార్యదర్శి సంతోష్, మున్సిపల్, ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి ఉపాధ్యాయ సంఘాల ధర్నా విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం యూఎస్‌పీసీ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నేడు జిల్లా కేంద్రంలో తలపెట్టిన కలెక్టరేట్ ఎదుట ధర్నా విజయవంతం చేయాలని నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన పీఆర్సీ కమిషన్ వేయాలని, బదిలీలు ప్రమోషన్లు చేపట్టాలని, సీపీఎస్ రద్దు చేయాలని, 317 జీఓ బాధితులకు న్యాయం చేయాలని వివిధ సమస్యల పరిష్కారానికి చేపట్టే ధర్నాను విజవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోయం ఇందురావ్, దూలం ఎల్లయ్య, హేమంత్ షిండే, కోట తిరుపతి, సింగతి ఉపేందర్, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులు ధ్రువపత్రాలు అందజేయాలి



నవతెలంగాణ-రెబ్బెన

ప్రతి విశ్రాంత సింగరేణి ఉద్యోగి బ్యాంకు ఖాతాను ఫార్మర్ లేదా సర్వేయర్ మోడల్‌లోకి మార్చుకోవాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెన్షన్ పొందుతున్న ఉద్యోగి మృతిచెందిన అనంతరం నామినికి పెన్షన్ అందించే క్రమంలో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. కావునా దీనిని గమనించి సీఎంపీఎఫ్ రీజినల్ కమీషనర్ జీడీకే ఆదేశాలను రిటైర్ అయిన ప్రతి ఉద్యోగి గమనించాలన్నారు. ఉద్యోగి, అతని భార్య ఆధార్‌కార్డు జిరాక్స్, పెన్షన్ పొందుతున్న బ్యాంకు ఖాతాను ఫార్మర్ లేదా సర్వేయర్ మోడ్‌లోకి మార్చిన అనంతరం జిరాక్స్, సీసీఆర్ఎంఎస్ కార్డు జిరాక్స్, మూడు ఫోటోలు జతచేసి, ధ్రువపత్రాలు(రెండు సెట్లు) సంబంధిత మైన్స్ డిపార్టుమెంట్లలో అందజేయాలని జీఎం తెలిపారు.

ఎస్సై సతీష్‌కు ప్రశంస

నవతెలంగాణ-జన్నారం

జన్నారం ఎస్సై పి.సతీష్ కుమార్‌కు రామగుండం సీపీ రెమా రాజేశ్వరి ప్రశంసా పత్రం అందించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల భారీ వర్షాలు కురిసిన సమయంలో ఎస్సై సతీష్ కుమార్ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి మంచి సేవలు అందించారు. దీంతో ఆయనకు గురువారం రామగుండంలో సీపీ ఉత్తమ సేవా పురస్కారం అందించారు. కార్యక్రమంలో పలువురు పోలీసు ఉన్నతాధికారులు, ఏసీపీ, డీసీపీ, సీఐ పాల్గొన్నారు.

ఫైలేరియా నివారణ మాత్రల పంపిణీ

నవతెలంగాణ-జైపూర్

మండల పరిధిలో ఫైలేరియా నివారణ చర్యల్లో భాగంగా గురువారం నివారణ మాత్రలను పంపిణీ చేసినట్టు మండల వైద్యాధికారి అనిల్ కుమార్ తెలిపారు. పది రోజుల పాటు కొనసాగనున్న ఈ కార్యక్రమం ద్వారా ఐదు సంవత్సరాలు పైబడిన వారందరికి పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. మొదట బూత్ స్థాయిలో ఇంటింటికి పంపిణీ చేయనున్నట్టు వివరించారు. ప్రభుత్వ పరంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఫైలేరియా నివారణ కోసం సహకరించాలని ఈ సంధర్భంగా కోరారు.

గృహలక్ష్మి పథకానికి 1500 దరఖాస్తులు

నవతెలంగాణ-దహెగాం

మండలంలో గత మూడు రోజులుగా స్వీకరించిన గృహలక్ష్మి పథకానికి 1500 మంది దరఖాస్తులు చేసుకున్నట్టు ఎంపీడీఓ రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు. రేపటి నుండి దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారిని ఎంపిక చేసిన అనంతరం ఈ నెల 21వ తేదీన లబ్దిదారులకు ప్రొసిడింగ్ కాపీలను అందజేస్తామని పేర్కొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

నవతెలంగాణ-దహెగాం

మండలకేంద్రంలో గురువారం తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మెర్పెల్లి అశోక్ మాట్లాడుతూ ఆదివాసులు ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సిడాం శంకరి, ప్రధాన కార్యదర్శి నల్లి దామోధర్, నాయకులు కోట శ్రీనివాస్, దిగిడె బక్కన్న, సోయం కమల, జూల లక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోయం ఇందురావ్
- ఘనంగా టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం చేయడమే తమ సంఘం లక్ష్యమని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోయం ఇందురావ్ పునరుద్ఘాటించారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన ఆవిర్భావ వేడుకలకు సంబంధించి ఐక్య గురుకులాల రాష్ట్ర కన్వీనర్ దూలం ఎల్లయ్య పతాకావిష్కరణ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉపాధ్యాయ సంఘాలు ప్రాంతాల వారీగా, యాజమాన్యాల వారీగా, కేటగిరీల వారీగా ఉన్న సందర్భంలో పాఠశాల ఉపాధ్యాయులందరినీ కలుపుకుని, పాఠశాల ఉపాధ్యాయులందరికీ ఒక ఉమ్మడి వేదిక ఉండాలనే విశాల దృక్పథంతో, ఒక చారిత్రక అవసరంగా అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలతో1974 ఆగస్టు 10వ తేదీన యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ 50 వసంతాలు పూర్తి చేసుకుందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తూ, ఉపాధ్యాయ పక్షాన నిలబడుతూ అనేక సమస్యలను పరిష్కరించడంలో, దశల వారి ఉద్యమాలతో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూ సమస్య పరిష్కారం కోసం కషి చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నప్పటికీ 50 సంవత్సరాల్లో ఎన్నో విజయాలు సాధించినట్లు గుర్తు చేశారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో పని చేయనున్నట్లు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో హేమంత్ షిండే, సింగతి ఉపేందర్, కోట తిరుపతి, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

బోదకాలు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బోదకాలు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం ఎండీఏ మాస్ డ్రగ్ నిర్వహణ కార్యక్రమాన్ని జిల్లా వైద్యాధికారి రామకృష్ణ, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాత్రలు వేసే విధానాన్ని అడిగి తెలుసుకుని మాత్రలు వేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుండి డీఈసీ మాత్రలు రెండు సంవత్సరాల పైబడిన వారికి అందజేయడం జరుగుతుందన్నారు. వీటి ద్వారా బోదకాలు నిర్మూలన సాధ్యమవుతుందని సిబ్బంది ప్రతి ఒక్కరికి మాత్రలు వేసే విధంగా చూడాలన్నారు. మాత్రలు వేసిన వారి పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. అన్ని రకాల విద్యాసంస్థల్లో మాత్రలు అందజేయాలన్నారు. నిర్దేశించిన విధానాల ప్రకారం 2 నుంచి 5 సంవత్సరాలు వారికి ఒక మాత్ర, 6 నుండి 14 సంవత్సరాల వారికి రెండు మాత్రలు, 15 నుండి 19 సంవత్సరాలు ఆపైన వారికి మూడు మాత్రలు ఇవ్వాలని తెలిపారు. వీటితోపాటు ఒక ఆల్బెండజోల్ మాత్ర కూడా అందించాలన్నారు. రెండు సంవత్సరాల లోపు పిల్లలకు గర్భిణీ స్త్రీలకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు, గుండె జబ్బులు, కిడ్నీ, ఊపిరితిత్తుల జబ్బులు ఉన్నవారికి మాత్రలు ఇవ్వకూడదని తెలిపారు. సిబ్బంది శక్తివంచన లేకుండా కృషి చేసినప్పుడే బోదకాల వ్యాధి నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్యాధికారి సుధాకర్ నాయక్, ఇతర వైద్య సిబ్బంది వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నస్పూర్ : జిల్లాలో బోదకాలు వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు అధికారుల సమన్వయంతో కృషి చేస్తున్నామని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా.జి.సి. సుబ్బారాయుడు, జోనల్ మలేరియా అధికారి డా.సుసీల్, మలేరియా సహాయ సంచాలకులు నాగయ్య, జిల్లా మలేరియా అధికారి డా.అనితతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి బోదకాలు మాత్రలను ఉద్యోగులకు అందించి, తాను స్వయంగా తీసుకొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ పర్యవేక్షకులు విశ్వేశ్వర్‌రెడ్డి, ఉప వైద్యాధికారి డా.విజయనిర్మల, ప్రోగ్రామ్ అధికారి డా.నీరజ, డా.ఫయాజ్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, సత్యనారాయణ, అల్లాడి శ్రీనివాస్ పాల్గొన్నారు.



ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సందర్శన

నవతెలంగాణ-రెబ్బెన



మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని గురువారం ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్ సందర్శించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని వైద్యులు, నర్సులు అందుబాటులో ఉండాలని, ప్రతి గ్రామానికి వెళ్లి వైద్యశిబిరాలు ఏర్పాటుచేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వైద్యులు మెలగాలని ఆమె సూచించారు. అనంతరం ఆస్పత్రి పరిసరాలను పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షాకాలంలో అనారోగ్యాలకు అధికంగా ప్రజలు గురయ్యే ప్రమాదం ఉన్నందున వైద్యులు ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి చికిత్స అందించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ గజ్జెల సత్యనారాయణ, డాక్టర్ సుజిత్, బీఆర్ఎస్ నాయకులు దోమల వెంకన్న, ఆనంద్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశపరీక్ష దరఖాస్తు గడువు పెంపు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

జవహర్ నవోదయలో 2024-25 విద్యాసంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి గాను నిర్వహించే ప్రవేశపరీక్ష దరఖాస్తు గడువు తేదీని నవోదయ విద్యాలయ సమితి పెంచినట్లు విద్యాలయం ప్రిన్సిపల్ బి చక్రపాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు స్వీకరణకు ముందు నిర్ణయించిన మేరకు ఈ నెల పదో తేదీ వరకు మాత్రమే ఉండగా, దీనిని ఈ నెల 17 వరకు పొడిగించినట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు నవోదయా.జీఓబీ.ఇన్, సీబీఎస్ఈఐటీఎంఎస్.ఆర్‌సీఐఎల్ఎల్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ల ద్వారా ఉచితంగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నూతన తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ నూతన తహసీల్దార్‌గా శ్రీపాల్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన మునావర్ షరీఫ్‌ను ప్రభుత్వం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అటాచ్ చేయగా, ఆయన స్థానంలో బెజ్జూరు తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డిని ఇక్కడికి బదిలీ చేసింది.

హర్ ఘర్ తిరంగా అవగాహన ర్యాలీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పోస్టల్ సబ్ డివిజన్ ఆధ్వర్యంలో గురువారం కాగజ్‌నగర్‌లో హర్ ఘర్ తిరంగా అవగాహన ర్యాలీని నిర్వహించారు. స్థానిక పోస్టల్ ప్రధాన కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ పలు రహదారుల గుండా సాగింది. ఈ సందర్భంగా పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సతీష్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలనే ఉద్దేశ్యంతో పోస్టల్ శాఖ అన్ని తపాలా కార్యాలయాలలో జాతీయ జెండాలను అందుబాటులో ఉంచిందని, రూ. 25 చెల్లించి ఈ జెండాలను తీసుకొని ఎగురవేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ కృష్ణతో పాటు బ్రాంచ్ పోస్టు మాస్టర్‌లు, పోస్ట్ మెన్‌లు పాల్గొన్నారు.

ఎనిమిది నెలల గర్భిణీకి పాము కాటు

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని జనగాం గ్రామానికి చెందిన ఎనిమిది నెలల గర్భిణీ నైతం అనిత పాముకాటుకు గురైంది. బుధవారం అనిత ఇంటి సమీపంలో ఉండగా పాము కాటు వేసింది. కుటుంబీకులు అందుబాటులో లేకపోవడం, అవగాహన రాహిత్యంతో ఆమె చికిత్స చేసుకోవడానికి రాలేదు. గురువారం కుటుంబసభ్యులు ఆమెను కౌటాల పీహెచ్‌సీకి తీసుకురావడంతో విషయం బయటకు వచ్చింది. ఆస్పత్రిలో సిబ్బంది ప్రథమ చికిత్స నిర్వహించి 108 అంబులెన్స్‌లో గర్భిణీని కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషపూరితమైన పాము కాకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని 108 అంబులెన్స్ ఈఎంటీ పిట్టల విజయ్ తెలిపారు. ఇప్పటివరకు తల్లి కడుపులోని శిశువు క్షేమంగా ఉన్నట్టు తెలిపారు. పైలట్ సలీం, ఆశావర్కర్ ఉన్నారు.

సీఎంపీఎఫ్ రికార్డుల పరిశీలన

రెబ్బెన : బెల్లంపల్లి ఏరియాలోని జీఎం కార్యాలయంలో గురువారం ఉద్యోగుల సీఎంపీఎఫ్ రికార్డులను సీఎంపీఎఫ్ ఇన్స్‌పెక్టర్ చిరంజీవి పరిశీలించారు. సీఎంపీఎఫ్-ఇ దరఖాస్తు విధానాన్ని వివరించారు. ఉద్యోగుల సీఎంపీఎఫ్ ఖాతాలో ఉండే డబ్బుల వివరాలను ఇకమీదట ఈపోర్టల్ హెచ్‌టీటీపీ/సీఎంపీఎఫ్.జీవోవి.ఇన్‌లో సులువుగా చేసుకోవచ్చన్నారు. అనంతరం ఫారెస్టు డిపార్టుమెంటులో పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ఐ లక్ష్మణ్‌రావు, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్ బెహెరా, డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి పాల్గొన్నారు.

మూగ జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

నవతెలంగాణ-సారంగాపూర్

వానాకాలం సీజన్‌లో వ్యాధులు రాకుండా మూగ జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో గాలికుంటు వ్యాధి టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడారు. టీకాలను ఉచితంగా ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. నేటి నుంచి 20 రోజుల పాటు ప్రతి గ్రామంలో కార్యక్రమం కొనసాగుతుందని అన్నారు. పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పశు వైద్యులు ముక్తార్, జైమిల్‌లు 2వందల పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుజాత, నాయకులు రాజ్ మహమ్మద్, శంకర్, పంచాయతీ కార్యదర్శి గోపి కృష్ణ, పశువైద్య సిబ్బంది లక్ష్మణ్, మల్లికార్జున్, రాజేందర్. రైతులు పాల్గొన్నారు.

చేనేత రంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఇటీవల తెలంగాణ చేనేత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన అంచెట్టి నాగన్నను ఎమ్మెల్యే జోగు రామన్న ఘనంగా సత్కరించారు. గురువారం పట్టణంలోని డీసీసీబీ బ్యాంక్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాగన్నను శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. చేనేత రంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షను వాయిదా వేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గ్రూప్-2 పరీక్షను వాయిదా వేయాలని కోరుతూ ఆదిలాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలదేవిని గురువారం గ్రూప్-2 అభ్యర్థులు కలిశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేసి అభ్యర్థులు సమస్యలను వివరించారు. సిలబస్‌లో మార్పులు, నూతన టాపిక్‌లు అదనంగా పొందుపర్చడం కారణంగా ప్రిపరేషన్ నిమిత్తం సమయం సరిపోదని అన్నారు. 2నెలల పాటు పరీక్షను వాయిదా వేయాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో జిల్లా కేంద్రానికి చెందిన గ్రూప్-2 అభ్యర్థులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తుల గడువు పెంచాలి



నవతెలంగాణ-తాంసి

రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు అందించే గృహలక్ష్మి పథకం దరఖాస్తుల సేకరణ గడువు పెంచాలని సీపీఐ మండల కార్యదర్శి చిలుక దేవిదాస్ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. మొదటగా నూతనంగా బాధ్యతలు తీసుకున్న తహసీల్దారును శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గృహలక్ష్మి పథకం ప్రవేశ పెట్టారని అన్నారు. దరఖాస్తులకు మూడు రోజుల గడువు ఉండటంతో ప్రజలు చాలా ఇబ్బందులకు గురికావడం జరుగుతుందని అన్నారు. జిరాక్స్ సెంటర్, మీసేవ కేంద్రాల్లో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలోనే దరఖాస్తులు ఇవ్వాలనే నిబంధన కారణంగా ప్రజలు మరింత ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఆయా గ్రామపంచాయతీ కార్యాలయంలోనే తీసుకోవాలని పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, రమేష్ ఉన్నారు.

సిరికొండ : రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం గృహలక్ష్మి పథకం ప్రవేశపెట్టి గడువు మూడు రోజులే ఇవ్వడం సమంజసం కాదని, ధరఖాస్తు గడువు పెంచాలని బీజేపీ నాయకులు గురువారం డిమాండ్ చేశారు. నియోజక వర్గానికి 3వేల ఇండ్లు ఇస్తామని చెప్పి మూడు రోజులే గడువు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. గడువును పెంచాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమృత్‌రావ్, నాయకులు రఘురాం, కృష్ణ పాల్గొన్నారు.

సీసీఎస్ నూతన సీఐగా సాయినాథ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



సీసీఎస్ నూతన సీఐగా సాయినాథ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు విధులు నిర్వహించిన సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ ఈ చంద్రమౌళి సాధారణ బదీలీల్లో బదిలీ అయ్యారు. ఖాళీ ఆయిన స్థానంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డికి పుష్పగుచ్చాన్ని అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో సీసీ దుర్గం శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బెల్ట్, టైల అందజేత



నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు గురువారం బాలాపూర్ గంగారాయుడు జ్ఞాపకార్థంగా ఆయన కుమారులు బాలాపూర్ మనోహర్‌రావు, బాలాపూర్ మహేష్, సొంత ఖర్చులతో తయారు చేయించిన బెల్టులు, టైలను భైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజేష్‌బాబు, సర్పంచ్ లక్ష్మణరావు, బీదరెల్లి పీఏసీఎస్ చైర్మెన్ వెంకటేష్‌గౌడ్, మాజీ పీఏసీఎస్ చైర్మెన్ రామారావు, భైంసా మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుధాకర్ రావు, చేతుల మీదుగా 133 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని చదువుకొని మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి మైసజీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లతీఫ్, సురేష్ జోషి, ఉపాధ్యాయులు నరేందర్, గంగాధర్, శ్రీనివాస్, ఇందిరా, మమ్మాయి శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన తహసీల్దార్‌కు సన్మానం



నవతెలంగాణ-తలమడుగు

మండలానికి నూతనంగా తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన రాజా మోహన్‌ని గురువారం బీఎస్పీ జిల్లా నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు తహసీల్దార్‌తో మాట్లాడుతూ గృహలక్ష్మి పథకానికి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు. రాజకీయ అండలతో కాకుండా నిజమైన పేదవారిని గుర్తించి, అమలు చేయాలని అన్నారు. తహసీల్దార్‌ను సన్మానించిన వారిలో ప్రధాన కార్యదర్శి కత్తెర లక్ష్మణ్ యాదవ్, నాయకులు పెగరల్ల అరవింద్, జువ్వక చందు, విజయ్ పాల్గొన్నారు.

పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం

- హాజరైన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని కాల్వ గ్రామంలో కొలువైన శ్రీ కాల్వ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం నూతన పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ రవికిషన్ పాలక సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ చైర్మెన్‌గా వుజారాం మహేష్, డైరెక్టర్లుగా పోటురి శ్రీనివాస్ రెడ్డి, గుమ్ముల చిన్న నర్సయ్య, ప్రీతం రెడ్డి, అంగోత్ విమల, ధమ్మ మహేష్, పూదరి శివలు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి నూతన పాలక మండలి సభ్యులను పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం అటవీ క్షేత్రంలోని పురాతన ఆలయమని, ఎన్నో సంవత్సరాల తరువాత మళ్లీ ఆలయాన్ని పునర్నిర్మించిన దేవాలయమని అన్నారు. ఇప్పటివరకు ఈ ఆలయాన్ని రూ.2 కోట్ల 25 లక్షలతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. రూ.కోటితో 2500 మంది భక్తులు వీక్షించే కల్యాణ మండపం నిర్మిస్తున్నామని అన్నారు. కోనేరు కూడా శిథిలావస్థలో ఉందని, నూతన కోనేరు నిర్మిస్తామని తెలిపారు. సీఎం కేసీఆర్ కెనాల్ పేరు కూడా కాల్వ నరసింహ స్వామి-27వ ప్యాకేజీ పేరు పెట్టారని పేర్కొన్నారు. కేసీఆర్‌కి దైవ భక్తి చాలా ఉందని అందుకే అన్నింటికీ దేవాలయాల పేర్లు పెట్టారని అన్నారు. ఆలయానికి నూతన రహదారి నిర్మిస్తామని గోశాల కూడా నిర్మించుకున్నామని తెలియజేశారు. ఆలయానికి భూదానం చేసినందుకు అయ్యవార్ల చిన్న నర్సయ్యకు అభినందనలు తెలిపారు. ఊరూరికి దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఆలయాన్ని అభివృద్ధి చేసి భక్తులను పెంచాలని నూతన పాలక మండలి సభ్యులకు మంత్రి సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యులు యు.సుభాష్‌రావు, ప్రముఖ పారిశ్రామికవేత్త మురళీధర్‌రెడ్డి, నర్సాపూర్ జెడ్పీటీసీ రామయ్య, ఎంపీపీ పాల్దె అక్షర అనిల్, వైస్‌ఎంపీపీ బాబురావు, బీఆర్ఎస్ నాయకులు రాంకిషన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, సర్పంచ్ తిరుమల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కులవృత్తులకు పూర్వ వైభవం

- నియోజకవర్గంలో ప్రారంభమైన లక్ష పంపిణీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కులవృత్తులకు పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ సారథ్యంలోని ప్రభుత్వం పాటు పడుతోందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బీసీల అభ్యున్నతి కోసం దేశంలో ఎక్కడాలేని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. పట్టణంలోని జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన బీసీ కులవృత్తిదారులకు రూ. లక్ష ఆర్థిక చేయూత చెక్కులను పంపిణీ చేశారు. తొలివిడతలో భాగంగా మూడు వందల మందిని ఎంపిక చేసి వారికి చెక్కులను అందించగా, ప్రభుత్వం తమకు అండగా నిలవడం పట్ల లబ్దిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి బీసీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని అన్నారు. బీసీల్లో అత్యంత వెనకబడిన ముప్పై అయిదు కులాల వారిని ఎంబీసీలుగా గుర్తించి, వారి సంక్షేమానికి పలు కార్యక్రమాలను అమలు చేశామని అన్నారు. కులవృత్తిదారులను ప్రోత్సహిస్తూ వారు ఆర్థిక ప్రగతి సాధించేలా పాటు పడుతున్నామని స్పష్టం చేశారు. తాజాగా రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తూ అండగా నిలబడుతోందని అన్నారు. బీసీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేల కోట్లను రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించిందని గుర్తు చేశారు. మరోవైపు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం అరవై శాతం ఉన్న బీసీల సంక్షేమాన్ని విస్మరించిందని అన్నారు. బీసీ ప్రధానిగా చెప్పుకునే నరేంద్ర మోదీ ప్రభుత్వం వారికి చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. బీసీలకు కేవలం రెండు వేల కోట్ల రూపాయలను బడ్జెట్‌లో కేటాయించడం కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని మండిపడ్డారు. అటు కాంగ్రెస్ పార్టీ హయంలోనూ బీసీలకు చేసిందేమీ లేదని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన లబ్దిదారులకే చెందేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలనీ సూచించారు. అత్యంత నిష్పక్షపాతంగా లబ్దిదారులను ఎంపిక చేసి, వారికి పథకాల ఫలాలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు, నాయకులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ వద్ద బీఎస్పీ కార్యకర్తల ఆందోళన



నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో పీయూసీ మొదటి సంవత్సరం విద్యనభ్యసిస్తున్న విద్యార్థి జాదవ్ బబ్లూ మృతికి నిరసనగా గురువారం నిర్మల్ జిల్లా బీఎస్పీ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్ ఆధ్వర్యంలో కార్యకర్తలు నాయకులు ప్రధాన గేటు వద్ద ఆందోళనకు ప్రయత్నించగా పోలీసులు యూనివర్సిటీ సెక్యూరిటీ గార్డులు అడ్డుకొని బీఎస్పీ పార్టీ నాయకులను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వానికి సీఎం కేసీర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్ మాట్లాడుతూ మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని అన్నారు. ఒకే సంవత్సరంలో నలుగురు విద్యార్థులు మరణించారని అన్నారు. యూనివర్సిటీని సీఎం కేసీఆర్ సందర్శించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఐదు రోజుల పాటు పీయూసీ విద్యార్థులకు సెలవులు...

ఆర్జీయూకేటీ యూనివర్సిటీ అసిస్టెంట్ డీన్ పావని పీయూసీ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఐదు రోజుల పాటు సెలవులు ప్రకటిస్తూ సర్క్యులర్ జారీ చేశారు. యూనివర్సిటీ ఉన్నతాధికారుల ఆదేశానుసారం పీయూసీ మొదటి సంవత్సరం విద్యార్థులకు నేటి నుండి 15వ తేదీ వరకు సెలవులు ప్రకటించారు. దీంతో తమ విద్యార్థులను తీసుకెళ్లేందుకు యూనివర్సిటీకి విద్యార్థుల తల్లిదండ్రులు తరలివస్తున్నారు.

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి గాండ్ల వరప్రసాద్ అన్నారు. ఉద్యమ జాగరణలో భాగంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. పీఆర్సీ కమిటీని వెంటనే నియమించి, ఐఆర్‌ని ప్రకటించాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులన్ని వెంటనే చెల్లించాలని అన్నారు. బకాయిలని వాయిదా పద్ధతిలో ఇవ్వడం మానుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ స్కూల్ కాంప్లెక్స్ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఉపాధ్యాయ ఉద్యమ జాగరణ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తుందని తెలిపారు. దాంట్లో భాగంగా ఆగస్టు 19న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద జరిగే రాష్ట్రస్థాయి మహాధర్నాని ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. జిల్లా అధ్యక్షుడు సునీల్ చవాన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో స్కావెంజర్స్ నియమించకపోవడం దారుణమని, ఉపాధ్యాయులకు గత తొమ్మిది సంవత్సరాలుగా పదోన్నతులు, ఐదు సంవత్సరాలుగా బదిలీలు లేకపోవడం దారుణమని అన్నారు. వెంటనే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు టీయూటీఎఫ్ నాయకులు నారాయణ, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పడాల రవీందర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిట్యాల సుహాసినిరెడ్డి, కేజీబీవీ సంఘ సభ్యులు, పెన్షనర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొని మద్దతు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ చౌహాన్, వలబోజు గోపికృష్ణ, ఆర్థిక కార్యదర్శి బచ్చు నారాయణ, జిల్లా నాయకులు అల్లూరి మనోజ్ రెడ్డి, డి.అంబాజీ, బత్తుల గంగాధర్, సింగిడి వెంకటరమణరెడ్డి, చంద్రశేఖర్ ముండే, గోమంత్ రెడ్డి, ఆడే వసంత్, జాదవ్ రాజ్ కుమార్, ఆదిలాబాద్ అర్బన్, తాంసి, నార్నూర్ ఉట్నూర్, సిరికొండ, బోథ్, బజార్‌హత్నూర్ మండలాల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సభ్యులు పాల్గొన్నారు.

విజయోత్సవ సభ కరపత్రాల విడుదల



నవతెలంగాణ-ఖానాపూర్

ప్రపంచ ఆదివాసీ దినోత్సవ విజయోత్సవ సభ కరపత్రాలను గురువారం తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో విడుదల చేశారు. విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశం మేస్రం నాగోరావ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో తొడసం శంభు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నిర్మల్ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవ విజయోత్సవ సభను 13న జేకే ఫంక్షన్ హాల్ విద్యానగర్ ఖానాపూర్‌లో జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసుల స్థితిగతులు, విద్యావైద్యం గురించి, జాతీయ నూతన అటవీ పరిరక్షణ చట్టం గురించి, నూతన విద్యా విధానం గురించి, 2006 అటవీ హక్కు చట్టం గురించి, డబుల్ బెడ్ రూమ్, గృహలక్ష్మీ పథకం గురించి, చర్చ జరుగుతుందని అన్నారు. ప్రతి గ్రామం నుంచి ఆదివాసీ పటేల్స్ దేవర్లు, మాహజాన్లు, మహిళలు విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, మేధావులు, పార్టీలకు అతీతంగా అందరు వచ్చి విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లింబారావ్, ఆత్రం మోతీరాం, సీడం భీంరావ్, మేస్రం నాగరాజ్, ఆత్రం భీంబాయి, లక్ష్మిబాయి, పార్వతి పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



నవతెలంగాణ-బేల

వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులను, ప్రజలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత అన్నారు. భారీ వర్షాలతో పంట నష్టం, ఆస్తి నష్టం జరిగి 20 రోజులు గడుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సర్వేలు నిర్వహించగా, నష్టపరిహారం అందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. బేల మండలంలో గురువారం పర్యటించిన ఆమె మీడియాతో మాట్లాడారు. విపత్తు కాలంలో ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని, అయినప్పటికీ ఇంతవరకు సర్వేలు నిర్వహించకపోవడం చూస్తే నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేలు నష్టపరిహారాన్ని అందించాలని, ఆస్తి నష్టం జరిగిన వారికి తక్షణ సాయంగా నిత్యావసర సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను కాపాడి, పేదలకు ఇంటి స్థలాలు అందించాల్సిన ప్రభుత్వమే ప్రభుత్వ భూములను అమ్మడం సిగ్గుచేటని అన్నారు. ఎన్నికలు వస్తున్నాయంటే ప్రజలను మోసగించేందుకు అనేక సంక్షేమ పథకాలు, రుణాల పేరిట బీఆర్ఎస్ ప్రభుత్వం మరో మారు సిద్ధమైందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఫైజుల్లా ఖాన్, మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, నాయకులు వామన్ వాంఖడే, బాపురావు ఉల్కే, గావండే ఘనశ్యామ్, సంజీవ్ గుండావార్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి, భోక్రే శంకర్, అఖిల్, గోడే అవినాష్, జైనథ్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు పిడుగు స్వామి పాల్గొన్నారు.

బీసీల ఆర్థిక చేయూత చెక్కుల అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

బీసీ కులవృత్తుల వారికి అందజేస్తున్న ఆర్థిక చేయూత రూ.లక్ష చెక్కును ఎంపీపీ గండ్రత్ రమేష్ పంపిణీ చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సెవ్వ జగదీష్. ఎంపీటీసీ గంగాధర్, సర్పంచ్‌లు భాస్కర్, గంగారాం, ఆత్మ కమిటీ చైర్మెన్ జిట్ట రమేష్, మల్లేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

నవతెలంగాణ-నస్పూర్

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, స్కూల్ స్వీపర్లకు కనీస వేతనం చెల్లించాలని, ఎస్సీ హాస్టల్లో క్యాటరింగ్ విధానం రద్దు చేయాలని అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు భానుమతి డిమాండ్ చేశారు. ఎస్సీ హాస్టల్ వర్కర్స్, అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు, స్కూల్ స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ మోతిలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భానుమతి, ఎస్సీ హాస్టల్ వర్కర్ యూనియన్ అధ్యక్షులు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మినీ అంగన్‌వాడీ టీచర్స్‌ను మెయిన్ టీచర్స్‌గా గుర్తించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, అలాగే గత 30 ఏండ్లుగా ప్రభుత్వ స్కూల్స్‌లో స్వీపర్లుగా పని చేస్తున్న కనీస వేతనం, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ ప్రమాద భీమా సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన వర్కర్ల కుటుంబాలను ఆదుకోని రూ.25 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గోమాస ప్రకాష్, సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం, అనురాధ, మహేశ్వరీ, సత్యవతి, సుజాత, ప్రేమలత, లక్ష్మి నారాయణ, రాజన్న పాల్గొన్నారు.0

ఎస్ఆర్‌పీ-3,3ఏ గనిని సందర్శించిన శాస్త్రవేత్తలు

నవతెలంగాణ-నస్పూర్

శాస్త్రీయ అధ్యయనంలో భాగంగా ప్రొఫెసర్ ఎస్.జయంత్, డాక్టర్ కె చరణ్ కుమార్, ఎన్ఐటి రూర్కెలా నేతృత్వంలో శాస్త్రవేత్తల బందం ఎస్ఆర్‌పీ-3,3ఏ గనిని గురువారం సందర్శించింది. ముందుగా గని పని స్థలాలను సందర్శించి వివరాల అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ ఉపరితల గని విస్తీర్ణంలో భాగంగా ఎస్ఆర్పి-3,3ఏ భూగర్భ గని లోని కొంత భాగాన్ని కలపడం కోసం అధ్యయనం చేయనున్నారు. ఉపర్తల గనిలో జరిగే బ్లాస్టింగ్ వలన ఎస్ఆర్పి-3,3ఏ గని మీద గల ప్రభావంపై అధ్యయనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం కే.రఘు కుమార్, ఎస్ఆర్పీ గ్రూప్ ఏజెంట్ గోపాల్ సింగ్, ఎస్ఆర్పి-3 గని డీవై జీఎం సంతోష్ కుమార్, బెల్లంపల్లి రీజియన్ ఆర్‌డి స్ట్రాట కంట్రోల్ ఇన్‌ఛార్జి అమర్ నాథ్, ఎస్ఆర్పీ డీవై ఎస్ఎస్ఓ ఈ.సంపత్, గని జేఎస్ఓ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ల తనిఖీ

నవతెలంగాణ-కోటపల్లి



మండలంలోని పారుపల్లి, ఎర్రయిపేట ఇసుక రీచ్‌లను తెలంగాణ ఖనిజ అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ జి.ప్రశాంతి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఇసుక రీచులలో లోడింగ్, అలాగే ధర్మకాంటాను, సీసీ కెమెరాలు పనితీరును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధర్మ కంట ప్రతి వాహనాన్ని లెక్కించాలని, అలాగే సీసీ కెమెరాలు 24 గంటలు ఉండే విధంగా చూసుకోవాలని సిబ్బందికి సూచనలు చేశారు. ఈమె వెంట మంచిర్యాల జిల్లా ప్రాజెక్ట్ అధికారి తారక్‌నాథ్‌రెడ్డి సంస్థ సిబ్బంది ఉన్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీలను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలోని రెండవ వార్డ్‌లో గల లక్ష్మీనగర్‌లో బీటీ రోడ్డును, సుభాష్‌నగర్‌లో రూ. రెండు లక్షల డీఎంఎఫ్‌టి నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును, ప్రశాంత్‌నగర్‌లో రూ.5లక్షల డిఎంఎఫ్టీ నిధులతో నిర్మించిన రోడ్డు, డ్రైనేజీని శుక్రవారం మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నస్పూర్ మున్సిపాలిటీని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నామని, అందులో భాగంగానే రోడ్లను, డ్రైనేజీలను నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపెల్లి ప్రభాకర్, బీఆర్ఎస్ నస్పూర్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బన్న, స్థానిక 2వ వార్డు కౌన్సిలర్ మడిగే మల్లయ్య, కౌన్సిలర్లు వంగ తిరుపతి, బడికే లక్ష్మి చీడం మహేష్ మర్రి రాజమౌళి, కుర్మిళ్ల అనపూర్ణ, టౌన్ ఉపాధ్యక్షులు సంతోష్ చారి, సీనియర్ నాయకులు పంబాల ఎర్రయ్య పాల్గొన్నారు.

ఆస్పత్రి ఆవరణలో రెండవ ఏఎన్‌ఎంలను నిరసన



నవతెలంగాణ-జన్నారం

తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ మండలంలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. తమను రెగ్యులర్ చేయాలని, ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చాలా సంవత్సరాలుగా సెకండ్ ఏఎన్ఎంగా పనిచేస్తున్న తమను ప్రభుత్వం పర్మినెంట్ చేయకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం స్పందించి 15వ తేదీ లోపు తమను రెగ్యులర్ చేయాలని కోరారు. లేకుంటే 15 తేదీ నుంచి నిరావధిక సమ్మెను చేస్తామని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో మండల సెకండ్ ఏఎన్ఎంలు, జి.సులోచన డి.లాహన్బాయి, ఎం.కల్పనా జి.మాధవి, వసంత రాజేశ్వరి, పద్మ, సంధ్యారాణి ప్రియాంక పాల్గొన్నారు.

దేశభక్తిని చాటేందుకే ఘర్ ఘర్ తిరంగా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రతి ఒక్కరు తమలోని దేశభక్తిని చాటేందుకే ఘర్ ఘర్ తిరంగా ఉద్దేశం అని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. పోస్టల్ విభాగం ఆధ్వర్యంలో రానున్న పంద్రాగస్టు వేడుకలకు సంబంధించి రూ.25కు జాతీయ జెండా ఇవ్వనున్న నేపథ్యంలో అధికారులతో కలిసి ముచ్చటించి జెండా ఆవశ్యకత వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పంద్రాగస్టు రోజు ప్రతి ఇంటి పైన జాతీయ జెండా ఎగురవేయాలని అన్నారు. తపాలా కార్యాలయాల్లో అందుబాటులో ఉంచిన జెండాలు కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలేష్‌గౌడ్ పాల్గొన్నారు.

దివ్యాంగుల కొరకు భవితా కేంద్రం ఏర్పాటు

నవతెలంగాణ జన్నారం

మండలంలోని అక్కపల్లిగూడలోని ప్రాథమిక పాఠశాలలో దివ్యంగుల కొరకు భవిత కేంద్రం ఏర్పాటు చేయడం జరిగినదని ఎంఈఓ విజయ్ కుమార్ తెలిపారు. ఈ భవిత కేంద్రంలో 18 సంవత్సరాలలోపు దివ్యాంగుల పిల్లలకు (అంగవైకల్యం) ఉచితంగా ప్రత్యేక శిక్షణ ఇచ్చి, వారికి ఫిజియోథెరపీ సేవలు కూడా చేయించడం జరుగుతుందన్నారు. 18 సంవత్సరాల లోపు దివ్యాంగ పిల్లలు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, ఈ శిక్షణ ఇస్తారన్నారు.

గృహలక్ష్మి పేరుతో మరోసారి దగా చేసేందుకు కుట్ర



నవతెలంగాణ-జైపూర్

బీఆర్ఎస్ ప్రభుత్వం మరో సారి ప్రజలను దగా చేయడానికి గృహలక్ష్మి పథకాన్ని తీసుకొచ్చిందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ దాసారపు శ్రీనివాస్ విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ఎత్తుగడగా పేద ప్రజల దృష్టిని గృహలక్ష్మి పథకం వైపు మర్లించేందకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. నియోజకవర్గం పరిధిలో మూడు మున్సిపాల్టీలు, ఐదు మండలాల పరిధిలో ఎన్ని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించారు. ఎంత మందికి పంచినారో తేటతెల్లం చెయాల్సిన అవసరమున్నదని అన్నారు. మందమర్రి, రామకృష్ణాపూర్ శివారుల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు గత తొమ్మిది సంవత్సరాలుగా లబ్దిదారులకు పంచకుండా తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ నియోజకవర్గమైన చెన్నూర్ నుండి స్థానికేతరుడైన బాల్క సుమన్‌ను గెలిపించుకున్న నియోకవర్గ దళిత కుటుంబాలకు చేకూర్చిన లాభం ఏమీలేదని పేర్కొన్నారు. దళితులకు కెటాయించిన భూములను స్మశాన వాటికలు, హరితహారం నర్సరీలు, రైతు వేధికలంటూ తిరిగి తీసుకుని దళితులకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేసిన ఆయన గృహ లక్ష్మి పథకం పేరుతో పేదళ్ల ఆశలు రేకెత్తించిన బీఆర్ఎస్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకంలో గల నియమనిబంధనలను సరళీకృతం చేయాలని డిమాండ్ చేశారు.

ఫీజు రీయింబర్స్ వెంటనే విడుదల చేయాలి

- మంచిర్యాలకు చేరుకున్న ఎస్ఎఫ్ఐ జీపు జాత



నవతెలంగాణ-హాజీపూర్

పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్ వెంటనే చెల్లించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన జీపు జాత మూడవ రోజు గురువారం హాజీపూర్ మండలానికి చేరుకుంది. గుడిపేట వద్ద సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, లిక్కర్ గోదాం హమాలీలు మద్దతు తెలిపారు. హాజీపూర్ పోలీస్‌స్టేషన్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్ర చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి మాట్లాడుతూ హాజీపూర్ మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలన్నారు. లక్షెట్టిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ మాట్లాడుతూ నూతన విద్యా విధానం రద్దు చేయాన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను తిప్పికొడతామని హెచ్చరించారు. ఉపాధ్యాయుల భర్తీ చేయలేదనీ పేర్కొన్నారు. లక్షెట్టిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల శిథిలావస్థలో ఉందనీ నూతనంగా నిర్మించాలనారు. ఎస్ఎఫ్ఐకి మద్దతుగా డివైఎఫ్ఐ సురేష్ మద్దతు తెలిపుతూ ఆయన మాట్లాడుతూ అధ్యయనం పోరాటంతో ఎస్ఎఫ్ఐ చదువుతూ పోరాడు చదువుకై పోరాడు అనే నినాదంతో ముందుకు కొనసాగుతోందన్నారు. మంచిర్యాల జిల్లాలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు దినేష్, రాజు, బెల్లంపల్లి సభ్యులు సాయి గణేష్, సంజయ్‌లు పాల్గొన్నారు.

చెన్నూర్ : విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఆహర్నిషలు కృషి చేస్తున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి దుండిగల అనిల్ అన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంల చేపట్టిన జీపు జాత మొదలు పెట్టిన జీపు యాత్ర మూడవరోజు పట్టణ కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడుతూ అనేక సమస్యలు విద్యార్థులను చుట్టుముట్టాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని బాగు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారనీ, కాని ఈ యాత్రలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాటర్ సౌకర్యం లేదని, ఫ్యాన్స్ లేవని, కంప్యూటర్ టీచింగ్ లేదని, కళాశాలలో మౌళిక సదుపాయాలు లేనట్టు గుర్తించామని అన్నారు. బెంచీలు, మరుగుదొడ్లు సరిగ్గా లేకా విద్యార్థులకు చాలా ఇబ్బందికరంగా, పాములు, తేళ్ల భయభ్రాంతులతోనే గురవుతున్నారని తెలిపారు. మహిళ ఎస్సీ బాలికల, బాలురు వసతిగృహాన్ని ఏర్పాటు చేయాలని, ఐటిఐ కళాశాల ఏర్పాటు చేయాలని,అలాగే రాష్ట్రంలో 5177 కోట్లు పెండింగ్లో స్కాలర్షిప్ ఫీజు బకాయిలను విడుదల చేయాలని, సంక్షేమ హాస్టల్లో సొంత భవనాలను నిర్మించాలని, ప్రతి మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, లెక్చర్లలను నియమించాలని కోరారు. ఈ యాత్రలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాగం శ్రీకాంత్, మిట్టపల్లి తిరుపతి, జిల్లా కమిటీ సభ్యులు మాదాసు రాజు, ఈదునూరి అభినవ్, బండి సత్యనారాయణ, పెద్దపల్లి సంజయ్, సాయి గణేష్ పాల్గొన్నారు.

జన్నారం : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన జీపు జాత గురువారం మండల కేంద్రానికి చేరుకుంది. మూడవరోజు కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో యాత్ర బృందం నాయకులు ఈదునూరి అభినవ్, మాదాసు రాజు, దినేష్, సాయి గణేష్, అజయ్ పాల్గొన్నారు





ఆశాలను రెగ్యులర్ చేసి, కనీస వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-నస్పూర్

ఆశాలను రెగ్యులర్ చేసి, కనీస వేతనాలు చెల్లించాలని, అలాగే పెండింగ్ లెప్రసీ ట్రైనింగ్ బిల్లులు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. గురువారం ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం అడిషనల్ కలెక్టర్ మోతిలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్, ఆశా వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సమ్మక్క మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద ప్రజలకు వైద్యం అందించే దిశగా ఆశాలు గత కొన్ని ఎండ్లుగా సేవలు అందిస్తున్నారని, ప్రపంచ వ్యాప్తంగా కరోనా మహమ్మారి సోకి ప్రజలు చనిపోతుంటే ప్రాణాలు పణంగా పెట్టి నిరంతరం సేవలందించిన ఆశ కార్యకర్తలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేలకు, మంత్రులకు జీతాలు పెంచిన ప్రభుత్వం ఆశాలపై నిర్లక్ష్యం వీడాలని అన్నారు. ప్రభుత్వం నిర్వహించే అన్ని సర్వేలు ఆశలతోనే చేపిస్తుందని, సంవత్సరాలు గడిచిన ప్రభుత్వం మమ్మల్ని రెగ్యులర్ చేయడం లేదని వాపోయారు. ఒకవైపు నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటుతుంటే మరోవైపు అధికారులు టార్గెట్ల పేరుతో ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. టీఏ, డీఏలు లేవని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మమ్మల్ని పర్మినెంట్ చేసి, కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ,ఉద్యోగ భద్రత సౌకర్యం కల్పించాలన్నారు. కరోనా సమయంలో రిస్క్ అలవెన్స్ లు రూ.16,000 ఇవ్వాలని, అర్హులైన ఆశాలను సెకండ్ ఏఎన్ఎంలుగా ప్రమోట్ చేయాలని, ప్రతి రిజిస్టర్లు ప్రభుత్వమే ఉచితంగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు గోమాస ప్రకాష్, దూలం శ్రీనివాస్, సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం, యూనియన్ జిల్లా కార్యదర్శి శోభ, కవిత, పద్మ, రాజేశ్వరి, రాణి పాల్గొన్నారు.

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న అద్దెబస్సు డ్రైవర్లు కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట జిల్లా అధ్యక్షులు టి దివాకర్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థలు సుమారుగా 20 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలు తీసుకుంటూ ఆర్టీసీ సంస్థకు లాభాలు రావడంలోనూ సంస్థకు అవార్డులు రావడంలోనూ కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులు అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, గ్రాట్యూటీ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు 8 గంటల పని విధానం కొనసాగించాలని, కుటుంబ సభ్యులకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా కల్పించాలని, కుటుంబ సభ్యులందరికీ ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లపై పని ఒత్తిడి తగ్గించాలని వేధింపులను అరికట్టాలని అన్నారు. కేఎంపిఎల్ విషయంలో డ్రైవర్లపై ఒత్తిడి తేవద్దని కోరారు. వారాంతపు సెలవులు ఇవ్వాలని, ప్రతినెల 5వ తేదీ లోపు బ్యాంకు ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని లేదంటే హక్కుల సాధన కోసం భవిష్యత్తులో నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అద్దె బస్సు డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు జె. మధుసూదన్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.బాలేష్ కుమార్, ఉపాధ్యక్షుడు ఎం.మల్లేష్, జాయింట్ సెక్రటరి ఎస్.కె.తాజ్ మియా, కోశాధికారి జి.సాయికృష్ణ, నాయకులు భాస్కర్, గోపాల్, కిరణ్, భాస్కర్, పి.తేజ, రాజశేఖర్, తిరుపతి, ప్రకాష్, మల్లేష్ పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కాసిపేట

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్ర మహాసభలను విజవంతం చేయాలని బెల్లంపెల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ పిలుపునిచ్చారు. గురువారం మందమర్రి ఏరియా కాసిపే-2వ గనిపై సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ గెట్ మీటింగ్ పిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిదులుగా హాజరైన ఆయన బాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, బ్రాంచ్ ఇన్‌ఛార్జి సీనియర్ నాయకులు చిప్ప నర్సయ్య ఉపాధ్యక్షుడు బియ్యల వెంకటస్వామి హాజరై మాట్లాడారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ 16వ సెంట్రల్ మహాసభలు గోదావరిఖని పట్టణములో ఈ నెల 25, 26, 27 తేదీల్లో భారీ బహిరంగ సభతో ప్రారంభమవునని, కేంద్ర రాష్ట్ర నాయకులు పాల్గొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను ఏ విధంగా కాలరాస్తున్నని తెలియజేస్తూ భవిష్యత్తు కార్యక్రమాలను ఈ మహాసభలో తీర్మానాలు చేసి పోరాటాలకు సిద్ధమవుతారు కాబట్టి మహా సభలను కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇన్కమ్ టాక్సని సింగరేణిలో అధికారులకు అలావెన్సల మీద పెర్క్స్ రూపంలో చెల్లిస్తున్న విదంగా కార్మికులకు కూడా చెల్లించాలని, సింగరేణి సంస్థలో ఎలక్షన్స్ నిర్వహించాలి, మారుపేరు ఉన్నా కార్మికులను స్వంతా పేరుతో ఉద్యోగ భద్రత కల్పించాలి, కార్మికులగృహ నిర్మాణానికి రెండు గుంటల భూమి, 20 లక్షల వడ్డీ లేని రుణాలను ఇప్పించాలి, సింగరేణిలోని ఉద్యోగానికి కార్మికుల పిల్లల వయసు 35 సంవత్సరాల నుండి 40 సంవత్సరాల కాలపరిమితిని పెంచాలన్నారు. అనంతరం టీబీజీకేఎస్ యూనియన్ నుంచి హెడ్ ఓవర్ మాన్ మొయినుద్దీన్, స్టాప్ నుంచి మచ్చ రమేష్, కేతన్ కుమార్, 53 మంది కార్మికులు ఏఐటీయూసీ యూనియన్‌లో చేరగా వారిని బ్రాంచ్ నాయకులు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పులి శంకర్, కొండపల్లి నర్సయ్య, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ బొద్దుల వెంకటేష్, చంద్రబోస్, రత్నం రాయలింగు, కుమార్ బాబు, తీరుదాల చంద్రయ్య, అంజయ్య, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్‌రూరల్

పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో పోలీసులు మర్యాదపూర్వకంగా ఉంటూ సమస్యలను ఓపికతో విని వాటిని పరిష్కరించాలని ఆసిఫాబాద్ ఎస్పీ కే. సురేష్ కుమార్ సూచించారు. కాగజ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో కేసులకు సంబంధించిన పురోగతిపై రికార్డులను పరిశీలించారు. తదుపరి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజల మధ్యే ఉంటూ పోలీసుస్టేషన్‌లో పని చేస్తున్న పోలీసుల పాత్రే కీలకంగా ఉంటుందని తెలిపారు. ప్రతి గ్రామం గురించి అవగాహన కలిగి ఉండాలని, ప్రజలతో మమేకమై, ప్రజలకు మరింత చేరువ కావాలని తెలిపారు. ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. నేర దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో గస్తీ వాహనాలను నిరంతరం తిప్పాలని, బీట్లు, పెట్రోలింగ్ సక్రమంగా నిర్వహించాలని అన్నారు. స్టేషన్ రికార్డులను, పరిసరాలను, శుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, ఎస్సై సోనియా, పీసీలు పాల్గొన్నారు.

బీసీలకు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-తాండూర్

కులవత్తులకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. గురువారం బెల్లంపల్లి పద్మశాలి భవన్‌లో 300 మంది బీసీ లబ్ధిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన కులవృత్తులకు ప్రోత్సాహాన్ని అందించేందుకుగాను ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కమ్మరి, రజక నాయి బ్రాహ్మణ కులవృత్తులను ప్రోత్సహించేందుకుగాను వారికి రూ.లక్ష ప్రోత్సాహాన్ని అందించడం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులతోపాటు యాదవులను, మత్స్యకార సొసైటీలను కులవృత్తులను బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. యాదవులకు గొర్రెల పంపిణీ మత్స్యకార సొసైటీలకు చేప పిల్లల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల స్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ పాల్గొన్నారు.

భీమిని : బెల్లంపల్లి నియోజకవర్గంలోని భీమిని మండలానికి చెందిన బీసీ కులవృత్తుల లబ్దిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం చెక్కులను గురువారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అందజేశారు. బెల్లంపల్లిలోని పద్మశాలి భవనంలో చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలానికి చెందిన 23 బీసీ లబ్దిదారులకు కలెక్టర్ సంతోష్, ఎంపీపీ పోతరాజుల రాజేశ్వరి, మార్కెట్ కమిటీ చైర్మన్ బి. నిరంజన్ గుప్తా, ఎంపీడీఓ శేఖ్, సప్దర్‌అలీతో కలిసి చెక్కులను పంపిణీ చేశారు. ఈ డబ్బులను వృధా చేయకుండా అవసరానికి వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కోరాడు. ఈ సందర్భంగా బీసీ లబ్దిదారులు ముఖ్యమంత్రికి స్థానిక ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

త్వరలో రెండో విడత గొర్రెల పంపిణీ

నవతెలంగాణ-జన్నారం

త్వరలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభిస్తుందని యాదవులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖ శ్యాం నాయక్ అన్నారు. గురువారం మండలంలోని లింగయ్యపల్లె, గ్రామానికి చెందిన పిండి నరేష్ మండల సొసైటీ డైరెక్టర్‌గా నూతనంగా నియమింపబడడంతో అతనిని ఎమ్మెల్యే రేఖ నాయక్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదవులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని, అదేవిధంగా రెండో విడత గొర్రెల పంపిణీ దారులు ఎలాంటి అపోహలు నమ్మవద్దని డీడీలు కట్టిన ప్రతి ఒక్కరికి గొర్రెల పంపిణీ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు పెంకర్ల మహేష్ యాదవ్, జక్కుల తిరుపతి యాదవ్, బోర్లకుంట రాజన్న, గుట్ల గోపాల్ యాదవ్ పాల్గొన్నారు.

నేషనల్ హెల్త్ మిషన్ స్కీమ్ వర్కర్ల సమ్మె సక్సెస్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేషనల్ హెల్త్ మిషన్ స్కీమ్ వర్కర్ల ఒకరోజు సమ్మెలో భాగంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో పనిచేస్తున్న అన్ని క్యాడర్లను పర్మనెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్, సౌకర్యం, బోనస్ గ్రాట్యుటీ, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కనీస వేతనం రూ.32000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాద భీమా రూ.50 లక్షలు ఇవ్వాలని అన్నారు. కరోన సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేశారని అప్పుడు ప్రభుత్వం వాళ్లని దేవుళ్ళతో సమానంగా పోల్చిన కేసీఆర్, ఇప్పుడు పట్టించుకోవడం లేదని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్, రెండవ ఏఎన్ఎం యూనియన్ రాష్ట్ర నాయకులు వసంత, జిల్లా అధ్యక్షుడు సంతోషి, జిల్లా ప్రధాన కార్యదర్శి పుణ్యవతి, వైస్ ప్రెసిడెంట్ భాగ్య సునీత, ప్రచార కార్యదర్శి భూదేవి, ప్రమీల, కోశాధికారి సునీత, కమల పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్-7 అంగన్‌వాడీ కేంద్రంలో మిషన్ ఇంద్రధనస్సు నిర్వహించారు.



ఈ కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రతపై అంగన్‌వాడీ టీచర్ కవిత ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని సూచించారు. చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. చేతులను శుభ్రపరచుకునే విధానాన్ని ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు మౌనిక, లక్ష్మి, ఉన్నారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు

పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కుచులాపూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుచులాపూర్ గ్రామానికి చెందిన బెల్లపు కృష్ణ(25) యువకుడు పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు కృష్ణ గత నాలుగు సంవత్సరాల క్రితం బొలెరో వాహనంలో ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తు వాహనం కింద పడటంతో మృతుడి వెన్నుపూస, చాతి భాగాలపై తీవ్రమైన దెబ్బలు తగలడంతో ఆస్పత్రులలో లక్షలాది రూపాయలు ఆపరేషన్ల కోసం ఖర్చుచేశాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు తాళలేక తన చేనులో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపారు. ఈనెల ఆరవ తేదీన గుర్తు తెలియని పురుగులమందు తాగాగా కుటుంబ సభ్యులు గమనించి, వెంటనే రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య, తల్లిదండ్రు ఉన్నారు.

నూతన తహసీల్దార్‌కు సన్మానం



నవతెలంగాణ-నార్నూర్

నూతనంగా నార్నూర్ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ రాజలింగంను ఆదివాసీ సంఘం నాయకులు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఆదివాసీ గ్రామాల్లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. గృహలక్ష్మి పథకంలో భాగంగా ఇల్లు లేని ఆదివాసులకు ఇండ్లు మంజూరు చేయాలని అన్నారు. సన్మానం చేసిన వారిలో జిల్లా సార్మెడి దుర్గు పటేల్, మాన్కాపూర్ పటేల్ రూపదేవ్, ఏఎంసీ వైస్ చైర్మెన్ తొడసం నాగోరావ్, వివిధ గ్రామాల ఆదివాసీ సర్పంచ్‌లు యుర్వేత రూపదేవ్, మడావి ముక్తా రూపదేవ్, సలాం ఆనంద్ రావ్, గ్రామస్తులు భీంరావ్, గోవింద్ ఉన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సంగీత ఏవన్ అన్నారు. గురువారం మావల మండలం కేంద్రంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ముఖ్యంగా పశువుల్లో ఈ వ్యాధి వచ్చిన యెడల నోటిలో పుండ్లు రావడం చొంగ కారడం, కాళ్ల డెక్కల మధ్యన పుండ్లు ఏర్పడటం వీటివల్ల రైతులకు చాలా నష్టం కలిగించే అవకాశం ఉంటుందని డాక్టర్ దూద్‌రాం రాథోడ్ సూచించారు. ఈ టీకాలను అన్ని గ్రామాల రైతులు తమ పశువులకు తప్పని సరిగా వేయించాలని కోరారు. ఈ కార్యక్రమం ఈ నెల చివరి వరకు కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొగ్గలి ప్రమీల రాజేశ్వర్, సాయి, ప్రసాద్, రమేష్, గోపాల మిత్రలు విలాస్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజేష్‌బాబు జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-భైంసా

భైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజేష్‌బాబు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఎన్నికల సమీపిస్తున్న వేళ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం పట్ల రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ కొనసాగుతుంది. ముధోల్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఆశిస్తున్నట్టు పలువురు చర్చించుకుంటున్నారు. చర్చలకు బలం చేకూర్చేలా భైంసా మార్కెట్ కమిటీ కార్యాలయంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి వేడుకలను నిర్వహించుకున్నారు. అనంతరం భైంసా ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేయడంతో పాటు, పలువురు రాజేష్‌బాబు అభిమానులు రక్తదానం చేశారు. పార్టీ ఆదేశిస్తే బరిలో ఉంటానని అన్నారు. భైంసాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టికెట్ ఎవరికీ ఇచ్చినా బీఆర్ఎస్‌ని గెలిపించడమే తమ ధ్యేయమన్నారు. గతంలో పలుమార్లు ఎంపీగా పోటీ చేస్తానని అధిష్టానాన్ని కోరిన మాట వాస్తవమే అన్నారు. ఉద్యమ కాలం నుంచి తాము బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నామని పార్టీ ఆదేశమే తమకు శిరోధార్యం అన్నారు. ముధోల్ బీఆర్ఎస్‌లో విభేదాలు అన్న మాట అవాస్తవమని చిన్నచిన్న సంఘటనలు జరగడం సహజమని అన్నారు వచ్చే ఎన్నికల్లో భారీ మెజారిటీతో బీఆర్ఎస్‌ని గెలిపించి తీరుతామని అన్నారు. జన్మదిన వేడుకల్లో మాజీ జడ్పీచైర్మెన్ లోలం శ్యామ్‌సుందర్, నాయకులు చిన్నారావు, తోట రాము, మైసెకర్ సాయిలు, శ్రీధర్, మహేందర్ పాల్గొన్నారు.

మండలానికి చేరుకున్న సమరభేరి జీపుజాత



నవతెలంగాణ-లోకేశ్వరం

సంక్షేమ వసతి గృహాల సంరక్షణ, ప్రభుత్వ విద్యా పరిరక్షణకై సమరభేరి జీపుజాత గురువారం లోకేశ్వరం కేంద్రానికి చేరుకుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శీతల్కర్ అరవింద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వానికి చూపి వాటిని రూపుమాపే ప్రయత్నమై జీపుజాత ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి లోకేశ్వరం మండలానికి చేరుకున్న నాయకులు బీసీ బాలుర వసతిగృహంలో బస చేసి విద్యార్థులతో మాట్లాడి వాళ్ల సమస్యలు తెలుసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ చార్జీలు రిలీజ్ చేసి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల కోసం నెలకు వచ్చే పాకెట్ మనీ గత కొన్ని నెలల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని, విద్యార్థికి ఉన్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ప్రతినెల రూ.1200 పాకెట్ మనీ ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు మరుగుదొడ్లు తక్కువ సంఖ్యలో ఉండటంతో అవి విద్యార్థులందరికీ సరిపోవడంలేదని అన్నారు. సర్వే చేసేటప్పుడు విద్యార్థులు తెలుపడంతో విద్యార్థులకు తగినన్ని మరుగుదొడ్లు వీలైనంత త్వరగా నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి శీతాల్కర్ అరవింద్, జిల్లా ఉపాధ్యక్షుడు పరమేశ్వర్, నాయకులు చరణ్, సాయి చరణ్, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

'కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తోంది'

- బీజేపీ వైఖరిపై ప్రజాసంఘాల నాయకుల మండిపాటు
- విజయవంతమైన మహా పడావ్ కార్యక్రమం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని ప్రజా సంఘాలు, కార్మిక సంఘాల నాయకులు అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా గురువారం కలెక్టరేట్ ఎదుట మహా పడావ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. స్థానిక సుందరయ్య భవనం నుంచి కుమురంభీం చౌక్‌కు చేరుకుని అక్కడ కుమురంభీం విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. అనంతరం సమ్మె శిబిరానికి తరలివెళ్లారు. భారతదేశాన్ని పరిపాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసి కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తోందన్నారు. సంఘాలను నిర్వీర్యం చేసేందుకు కుట్రపన్నుతున్నారని మండిపడ్డారు. పోరాడి సాధించుకున్న 8 గంటల పనిదినాలను ఎత్తివేసి, మళ్లీ బానిసల్లా మార్చేందుకు యత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్యలను తిప్పికొడుతూ రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి, ఆశన్న, సిఐటియు అధ్యక్షత న విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆశన్న, ఉపాధ్యక్షులు డి.మల్లేష్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట నారాయణ, ప్రజా సంఘాల నాయకులు రాజు, ఛాయ, వెంకటమ్మ, సునిత పాల్గొన్నారు.

ఆదివాసుల హక్కులకు తూట్లు

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదివాసీ హక్కులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్ అన్నారు. గురువారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని, గిరిజన గూడాల్లో పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలో మాలే బొరిగాం కేబీ కాలనీ పర్యటించి, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గుడిపెల్లి నగేష్, జిల్లా మైనార్టీ సెల్ చైర్మెన్ ఖలీంతో సహా కలిసి మాలే బొరిగాం గ్రామ ఆదివాసులతో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు చేసినటువంటి సంక్షేమ కార్యక్రమాలు ఆదివాసుల కోసం తీసుకువచ్చినటువంటి ప్రత్యేక చట్టాలు కల్పించిన హక్కులను గురించి వివరించారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అటవీ హక్కు చట్టాలు పిసా యాక్ట్ అన్నింటిని పగడ్బందీగా అమలు చేసి గిరిజనులను రక్షించుకుంటామని అన్నారు.



గిరిజనులను అడవి తల్లికి దూరం చేసే కుట్రను తిప్పికొడతామని అన్నారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కేబీ కాలని గ్రామంలో 150 ఎకరాల పోడు భూములకు అటవీ భూమికి అటవీ హక్కు పత్రాలు కల్పించిన, ఘనత కాంగ్రెస్ పార్టీదని డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ స్పష్టం చేశారు.

నర్సింగ్ కళాశాల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక నూతన సంస్కరణలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. గురువారం పట్టణంలోని డీఎంహెచ్ఓ కార్యాలయ ఆవరణలో రూ.34 కోట్ల నిధులతో నిర్మించనున్న నర్సింగ్ కళాశాల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ముందుగా కళాశాల నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా కేటాయించిన నాలుగు 108 వాహనాలు, రెండు 102 వాహనాలు, రెండు పార్థివ వాహనాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్కారు దవాఖానాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందిస్తున్నామని అన్నారు. అందుకోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. టీ హబ్‌లో 134 రకాల రక్తపరీక్షలను ఉచితంగా చేస్తున్నారని తెలిపారు. 69 పల్లె దవాఖానాలు, రెండు బస్తీ దవాఖానాలు కొనసాగుతున్నాయని తెలిపారు. తాజాగా నర్సింగ్ కళాశాల నిర్మాణం కోసం ప్రభుత్వం 34 కోట్ల నిధులను కేటాయించిందని అన్నారు. ఇందుకు సహకరించిన సీఎం కేసీఆర్, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రిమ్స్‌లోనూ రూ.కోట్లాది వ్యయంతో అధునాతన యంత్రాలు, పరికరాలను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, అదనపు డీఎంహెచ్ఓ సాధన, మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అనిత, ఎంపీపీ గండ్రత్ రమేష్, నాయకులు మెట్టు ప్రహ్లాద్, సాజిదోద్దీన్, కుమ్ర రాజు పాల్గొన్నారు.

ఫైలేరియా నివారణే లక్ష్యంగా పని చేయాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

జాతీయ ఫైలేరియా నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ మాట్లాడుతూ ఫైలేరియా నివారణ లక్ష్యంగా పని చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. భవిష్య తరానికి ఫైలేరియా నుంచి విముక్తి కలిగించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫైలేరియా వ్యాధి ఎలా వస్తుంది. వ్యాధి లక్షణాలు, వ్యాధి వచ్చే శరీర భాగాలు, ఫైలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల వయసును, ఎత్తును బట్టి తగు మోతాదులో మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రత్యుష, తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీఓ శేఖర్, వైద్య సిబ్బంది శేషయ్య, శివకృష్ణ గౌడ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కడెం : బోదకాలు వ్యాధి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ శివకుమార్ అన్నారు. గురువారం మండలంలోని కొత్త మద్దిపడగ, గంగాపూర్, అంబారిపేట్, మాసాయిపేట్ గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోదకాలు నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో అందరికీ బోదకాలు వ్యాధి నిర్మూలన మాత్రలు అందజేస్తున్నామని అన్నారు. అలాగే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ గోపాల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



దిలావర్‌పూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది జాతీయ ఫైలేరియా నిర్మూలన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కళాశాల సిబ్బందికి ఫైలేరియా నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కందూరి శంకర్ మాట్లాడుతూ ఫైలేరియా రాకుండా ఉండాలంటే ప్రజలందరూ సంవత్సరానికి ఒకసారి మాత్రలు మింగాలని అన్నారు. వ్యాధికారక దోమలను అరికట్టాలని, దోమ కాటుకు గురికారాదన్నారు. బోదకాల వ్యాధికి తప్పనిసరిగా చికిత్స చేయించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పట్వారీ నవీన్ కుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ముధోల్

ముధోల్ మండల సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ ఆయేషా అఫ్రోజ్‌ఖాన్ అధ్యక్షతన సాదాసీదాగా కొనసాగింది. ఉదయం 11 గంటల 30 నిమిషాలకు ప్రారంభం కావాల్సిన సమావేశం 12 గంటలకు ప్రారంభమై 1:45 నిమిషాలకు ముగిసింది. మొత్తం 21అంశాలకుగాను 18 అంశములపై కొనసాగింది. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో విద్యుత్ తీగలు వదులుగా ఉన్నాయని, అలాగే పలు విద్యుత్ స్తంబాలు అవసరం ఉన్నాయని సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే ముధోల్‌లోని ఉర్దూ మీడియం బాలికల ఉన్నత పాఠశాలలో ఉర్దూ సబ్జెక్ట్, ఇంగ్లీష్ టీచర్ పోస్టులు ఖాళీ ఉన్నాయని అన్నారు. అక్కడున్న ఉపాధ్యాయురాలిని ఎలాంటి ఆర్డర్ లేకుండా భైంసాకు బదిలీ చేయడం సరికాదని, మండల కోఆప్షన్ సభ్యులు ఖాలీద్ సభ దృష్టికి తీసుకువచ్చారు. ముధోల్ సర్పంచ్ రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. వెంటనే ఏలాంటి ఆర్డర్ లేకుండా బదిలీ చేసిన ఉపాధ్యాయురాలిని తిరిగి ముధోల్ పాఠశాలకు పంపించాలని పేర్కొన్నారు, డిగ్రీ కళాశాల వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో నేటి నుంచి పశువులకు గాలికుంటు టీకాలు ఇవ్వడం జరుగుతుందని పశువైద్యాధికారి డా.రాజేష్ తెలిపారు. గ్రామాల్లోని శిఖం భూములు కబ్జా గురికావడంతో పశువులు మేసేందుకు సైతం భూమి లేకుండా పోతుందని అన్నారు. అనుమతి లేని వెంచర్లు వెలుస్తున్నాయని, అనుమతులు ఉన్న వాటికి మాత్రమే విద్యుత్ శాఖ అధికారులు మీటర్లకు అనుమతి ఇవ్వాలని అన్నారు. ఆర్టీసీ ప్రయాణికులకు సౌకర్యవంతమైన వసతులను కల్పిస్తుందని విలేజ్ బస్సు ఆఫీసర్ భూమేష్ తెలిపారు. మండలానికి ఇద్దరు చొప్పున విలేజ్ బస్సు అధికారులను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్నారు. ప్రయాణికులు రాయితీతో ముందస్తు టికెట్ తీసుకున్నట్లయితే తీసుకున్న టికెట్‌పై రాయితీ సౌకర్యం కల్పించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ సురేష్ బాబు, ఎక్సైజ్ ఎస్సై రమేష్‌గౌడ్, సీడీపీఓ శ్రీమతి, ఎంఈఓ మైసజీ, ఆయా శాఖల అధికారులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్ల సేవలు మరువలేనివి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశం కోసం ఎండనక, వాననక రక్షణగా ఉంటున్న ఆర్మీ జవాన్ల సేవలు మరువలేనివని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి అన్నారు. గురువారం మేరా మాటి మేరా దేశ్ కార్యక్రమాన్ని పట్టణంలోని ఆమె కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ రక్షణలో అమరులైన జవాన్ల చిత్రపటానికి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుల సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-జైనథ్

ఇటీవల షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన బాధిత కుటుంబానికి గురువారం సీపీఐ(ఎం) నాయకులు ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండలంలోని పూసాయి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ సిరుగురే అశోక్ ఇల్లు షార్ట్‌సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. ఇందులో బాధితుడికి నిత్యవసర సరుకులు పూర్తిగా దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) నాయకులు బాధిత కుటుంబానికి రూ.3వేలు, తినడానికి సరుకులని అందించి, మేమున్నామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, కొత్త ఇల్లు మంజూరు చేసి, నష్ట పరిహారాన్ని చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బండి దత్తాత్రి, ముకినెపల్లి గంగన్న, నాయకులు పండుగ పోచన్న, ఆశన్న పాల్గొన్నారు.

విద్యార్థుల మానసిక స్థితిపై యాప్ ఏర్పాటు

నవతెలంగాణ-బాసర

విద్యార్థుల మానసిక స్థితిపై యాప్‌ను ఏర్పాటు చేసినట్టు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకటరమణ తెలిపారు. గురువారం అమెరికాకు చెందిన మానసిక వైద్యుడు మైక్ ఆన్‌లైన్‌లో యూనివర్సిటీ అధ్యాపకులకు అవగాహన కల్పించినట్లు వివరించారు. ఈ యాప్‌లో 17 ప్రశ్నలకు సంబంధించి విద్యార్థి ఇచ్చిన సమాధానాలు ఆధారంగా విద్యార్థి మానసిక స్థితి గురించి తెలుసుకోవచ్చని మోహన్ బిట్స్ పిలాని వివరాలను వెల్లడించారు. ఈ యాప్ ద్వారా ఆ విద్యార్థి మానసిక స్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చునని యూనివర్సిటీలో ఈ యాప్ అమలు చేయనున్నట్టు వీసీ వెంకటరమణ తెలిపారు. సమావేశంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 9న జాతీయ లోక్ ఆదాలత్

నవతెలంగాణ-బోథ్

సెప్టెంబర్ 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం బోథ్ కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. రాజీకి ఉన్న కేసులను అలాగే ఎక్కువ మొత్తంలో కేసులు రాజీ చేసే విధంగా న్యాయవాదులు సహకరించి, విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కే.సుభాష్, అంగద్ కేంద్రే, ఆడెపు హరీష్, కుమ్మరి విజయ్ కుమార్, విక్రమ్ సింగ్, జమీర్‌ఖాన్, రాథోడ్ ప్రతిమ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఎదుట రెండో ఏఎన్ఎంల సమ్మె

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ముందు గురువారం రెండో ఏఎన్ఎంలు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 18, 20 సంవత్సరాల నుంచి రెండో ఏఎన్ఎంలుగా పనిచేస్తున్నామని తెలిపారు. రెగ్యులర్ చేస్తారనే ఆశతో ఇన్నేండ్లుగా చాలిచాలని వేతనాలతో విధులు నిర్వహించామని అన్నారు. ప్రస్తుత తరుణంలో నోటిఫికేషన్ వేసి పరీక్షలు రాస్తే వెయిటేజ్ ఇచ్చి రెగ్యులర్ చేస్తామనడం బాధాకరంగా ఉందన్నారు. మా పిల్లలతో పోటీపడి పరీక్షలు రాయమంటారాని ప్రశ్నించారు. నోటిఫికేషన్ రద్దు పరిచి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. నోటిఫికేషన్ రద్దు చేయని పక్షంలో ఆగస్టు 15 తేదీ నుంచి సమ్మెకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమ్మెలో వెంకటమ్మ, సువర్ణ, మణిలత, రేణుక, లక్ష్మి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శ

నవతెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల గ్రామంలోని ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఉరే రాములు కుటుంబాన్ని ఎంపీపీ తుల శ్రీనివాస్ గురువారం పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. అలాగే చింతలబోరి గ్రామంలో ఇటీవల మృతి చెందిన యువకుడు కేంద్రే నితీష్ కుటుంబాన్ని పరామర్శించి, రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీ సునీత రోహిదాస్, నాయకులు విజయ్, బాపూరావు, జుగాదిరావు, ఈశ్వర్, నర్సయ్య, పెద్ద భోజన్న, హరీష్, సందీప్, శరత్, విజయ్, సుజయ్ పాల్గొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తులకు బారులు తీరిన జనం

నవతెలంగాణ-తాంసి

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి గురువారం చివరి రోజు కావడంతో తాంసి, భీంపూర్ మండల కేంద్రాలు ధరఖాస్తుదారులతో జీరాక్స్ సెంటర్లు, మీసేవ కేంద్రాలు, ఫొటో స్టూడియోల ముందు ప్రజలు బారులు తీరారు. ఇదే అదునుగా భావించి ధరఖాస్తు ఫారాలకు జీరాక్స్‌లకు ఇష్టం వచ్చినట్లు ప్రజల నుంచి డబ్బులు తీసుకున్నట్టు ప్రజలు వాపోయారు. దరఖాస్తులు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ముందు బారులు తీరారు. అయ గ్రామపంచాయతీ కార్యాలయంలోనే ధరఖాస్తులు తీసుకుంటే బాగుండేదని ప్రజలు అభిప్రాయపడ్డారు. భీంపూర్ మండలంలో మొత్తం 2,657 దరఖాస్తులు అందినట్టు తహసీల్దార్ పేర్కొన్నారు.

నార్నూర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహలక్ష్మి పథకానికి రెండు రోజులు గడువు ఇవ్వడంతో దరఖాస్తుదారులు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో బారులు తీరారు. ఆఖరు గడువు ఉండటంతో చివరి రోజు 15 వందల దరఖాస్తు స్వీకరించినట్లు డీటీ అమృత్‌లాల్ పేర్కొన్నారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో ఇప్పటి వరకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి 2,343 దరఖాస్తులు వచ్చినట్టు ఆయన తెలిపారు.

25వ రోజుకు చేరిన రిలే నిరాహారదీక్షలు

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ సమీపంలోని రెవెన్యూ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహారదీక్షలు గురువారం నాటికి 25రోజుకు చేరుకున్నాయి. రిలే దీక్షలో సినియర్ సిటిజన్లు పాల్గొన్నారు. ఆదిలాబాద్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ సంఘీభావం తెలియజేశారు. అలాగే బోథ్‌కు రెవిన్యూ డివిజన్, డిగ్రీ కాలేజీ, కోర్టు భవనం, తప్పనిసరిగా ఉండాలని అన్నారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసేంత వరకు రిలే దీక్షలు కొనసాగుతాయని అన్నారు. అలాగే జిల్లా పద్మశాలి సంఘం పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.